జాతీయ జెండాలతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై తమ దేశ సైనికులు జరిపిన దాడిలో ప్రధాని మోదీ కృషి అభినందనీయం అని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడాన్ని హర్షిస్తూ ఆదివారం ముషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్ గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు జమాల్‌పూరి నందు, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు బద్రినారాయణ, నాయకులు బాలకృష్ణ, రమేష్, చారి, గిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా స్వామి రథోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన శృంగార రథోత్సవం వైభవంగా సాగింది. స్వామివారి రథోత్సవం చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధులగుండా ఊరేగించారు. ఈ వేడుకలను ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు, ఆలయ ఈవో అన్నపూర్ణ పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి



సుబుదేంద్రా తీర్థ స్వామితో దిడ్డి రాంబాబు తదితరులు

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని రాఘవేంద్ర మఠం పీఠాధిపతి సుబుదేంద్రా తీర్థ స్వామి అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఆధునికీకరించిన పరిమళ కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, అనంత్‌పురానిక్, అనిల్, విఠల్‌జోషి, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఓబీ నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): హుందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం - 5 వద్దగల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ చిన్నయ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి 35 ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి : సీఐ

కవాడిగూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పీఎస్ పరిధిలో నేరాల అదుపుతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయాలకుఅతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని గాంధీనగర్ సీఐ ఎన్.బోస్ కిరణ్ సూచించారు. ఆదివారం గాంధీనగర్ పీఎస్‌లో సీఐగా బాధ్యతలు చేపట్టిన బోస్‌కిరణ్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిందం శ్రీశైలం, నగర నాయకులు డి.శ్రీనివాస్‌లు కలిశారు. శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పీఎస్ పరిధిలో జరిగే సంఘటనలను రాజకీయాలకు అతీతతంగా ఎప్పటికప్పుడు తెలియజేసి శాంతిభద్రతలు పరిరక్షణకు, నేరాల అదుపునకు కృషి చేయాలని సూచించారు.



సీఐ బోస్‌కిరణ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సిందం శ్రీశైలం, డి.శ్రీనివాస్



గజేంద్రప్యాలెస్ వద్ద ప్రమాదకరంగామారిన సీవరేజ్‌లైన్ మ్యాన్‌హోల్

ప్రమాదకరంగా సివరేజీ మ్యాన్‌హోల్

చిక్కడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ గజేంద్ర అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా మారిన సివరేజీ పైప్‌లైన్ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. దీనికి మరమ్మతులు చేయడంలో వాటర్‌వర్క్స్, సివరేజీ బోర్డ్ సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 20 రోజులుగా సివరేజీ పైప్‌లైన్ మ్యాన్‌హోల్ పగిలిపోయి ఓపెన్‌గా ఉంది. దీంతో స్థానికులు రవీందర్‌యాదవ్ తదితరులు వాటర్‌బోర్డ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు తాత్కాలికంగా మ్యాన్‌హోల్ చుట్టూ ఓ డివైడర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఫుట్‌పాత్‌పై నడిచే పాదచారులు, అపార్ట్‌మెంట్‌కు రాకపోకలు సాగించేవారు తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌తో ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మ్యాన్‌హోల్‌ను పునర్‌నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల పెళ్లిళ్లకు అండగా త్యాగరాయ గానసభ

- వేడుకలకు ఉచితంగా వేదిక
- రెండేళ్లలో ఇప్పటి వరకు 94 వివాహాలు



చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ

> పెళ్లి అంటే నూరేళ్ల పంట. వధూవరుల జీవితంలో నూతన మైలురాయి. అయితే నేడు పెళ్లి అంటే ఎంతో ఖరీదుగా మారింది. పెరిగిన ఫంక్షన్‌హాల్ రేట్లు, భోజన, వేదిక ఇలా ఎన్నో ఖర్చుల వల్ల పేదలు పెళ్లిళ్లు చేసుకోవడం ఆర్థికభారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న పేదలు పెళ్లిళ్లు చేసుకోలేని, చేయాలనుకునే వారికి చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయగానసభ ఆపన్న హస్తం అందిస్తోంది.

రాంనగర్/చిక్కడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): పేదల పెళ్లిళ్లకు శ్రీత్యాగరాయగానసభ వేదికను ఉచితంగా ఇవ్వడంతోపాటు పెళ్లికి కావాల్సిన వేదిక, టెంట్ సామగ్రిని అందిస్తోంది. భోజనాలు పెట్టుకోలేని వారికి 150 మందికి మించకుండా భోజనాలు కూడా ఉచితంగా అందిస్తోంది. అంతేకాకుండా పుస్తెమెట్టెలు కొనుగోలు చేయలేని వారికి సహకారం అందిస్తూ సేవాతత్పరతను చాటుకుంటోంది.

నేటి వరకు 94 ఉచిత పెళ్లిళ్లు

శ్రీత్యాగరాయ గానసభ వ్యవస్థాపకుడు, పూర్వ అధ్యక్షుడు దివంగత కళాసుబ్బారావు జయంతిని పురస్కరించుకుని ఆ సంస్థ ప్రస్తుత అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి 2022 మే 9న కులమతాలకు తావులేకుండా ప్రాంతాలకు అతీతంగా పేదలు పెళ్లిళ్లు చేసుకోవడానికి శ్రీత్యాగరాయ గానసభ మెయిన్ హాల్‌ను ఉచితంగా ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. నేటి వరకు 94 పెళ్లిళ్లను ఉచితంగా నిర్వహించామని తెలిపారు. ఈ ఉచిత పెళ్లిళ్ల ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు ఏ రోజైనా చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు.. ఇక్కడ పెళ్లిళ్లు చేసుకునే పేదలకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మీ పథకం కింద రూ.1,01,116 ఆర్థిక సహకారం అందేలా కృషి చేస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పేదప్రజలు పెళ్లిళ్లు చేసుకోవడం కోసం శ్రీత్యాగరాయ గానసభ అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. కళాసుబ్బారావు చేస్తున్న సేవలను కొనసాగించాలనే లక్ష్యంతోనే ఉచిత వివాహ కార్యక్రమంలో ఇప్పటి వరకు 94 పెళ్లిళ్లు జరిగాయి. ఉచితంగా పెళ్లిళ్లు చేసుకోవాలనుకునే వారు 10 రోజుల ముందు గానసభ మేనేజర్‌ను గానీ, ఇతర వివరాలకు 9849020008 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చు.

- కళా జనార్దనమూర్తి, శ్రీత్యాగరాయ గానసభ అధ్యక్షుడు



ఆహూతులు కూర్చోవడానికి హాల్



త్యాగరాయ గానసభ వేదిక

ఆకట్టుకున్న శేషు పాటల ఝరి



శేషగిరిరావుకు రికార్డ్ అందించి అభినందిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంగీత ప్రపంచానికి వరం శేషగిరిరావు అని కళాభారతి సిటీ కల్చర్ సెంటర్ అధినేత పురుషోత్తం నారగొని అన్నారు. 65 ఏళ్ల వయసులో 12 గంటలపాటు నిర్విరామంగా 120 పాటలు పాడి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన గాన విజేత శేషగిరిరావు అని ప్రశంసించి ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కళాభారతి సిటీకల్చర్ సెంటర్‌లో ఈ రికార్డ్ కార్యక్రమం ఆదివారం భువన సంగీత ఝరి సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. పురుషోత్తం మాట్లాడుతూ శేషగిరిరావు గానం వినోదానికి కాదు వినయానికి ఉదాహరణ అన్నారు.

ఆయన పదవిలో ఉన్నప్పుడు ఇరిగేషన్ శాఖ అధికారిగా నీటిని ప్రవహింపచేశారని ఉద్యోగవిరమణ తర్వాత గానం ద్వారా స్వరాన్ని ప్రవహింపచేస్తున్నారన్నారు. ఆయన గానం భావాలకు వేదిక అన్నారు. కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధినేత వెంకటాచారి, కార్యక్రమ నిర్వహణాసంస్థ ప్రతినిధి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. శేష పాటల బహార్ పేరిట ఆకట్టుకునేలా జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, హిందీపాటలను ఆలపించారు.

విద్యతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలి



సర్టిఫికెట్లు, బెల్ట్‌లు, మెడల్స్ పొందిన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు

చిక్కడపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు శిక్షణ పొందాలని హైదరాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణ పిలుపునిచ్చారు. గాంధీనగర్ కెనరా బ్యాంక్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో ఆదివారం హైదరాబాద్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో బెస్ట్ గ్రేడింగ్, కలర్ బెల్ట్, బ్లాక్ బెల్ట్ టెస్టులో ఉత్తీర్ణులైన క్రీడాకారులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ 65 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బెల్టులు, మెడల్స్ పంపిణీ చేసి, మాట్లాడారు. తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంచడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో ఎగ్జామినర్ సంజయ్, రాకేష్, లక్ష్మీనారాయణ, సీనియర్ కోచ్‌లు మణీష్, స్వామి, రఘు, విష్ణు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిని చాలెంజ్‌గా తీసుకుంటే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తిరికొండ మధుసూదనాచారి

బర్కత్‌పుర, మే 18(ఆంధ్రజ్యోతి): వృత్తిని చాలెంజ్‌గా తీసుకునప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. వృత్తిని ఎంచుకునే ముందు ఆ వృత్తిపట్ల ఉన్న అవగాహను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమాచార హక్కు వికాస సమితి గౌరవ అధ్యక్షుడు కాచం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశ్వంభర పత్రిక మొదటి వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పత్రికలు ప్రధాన పాత్రపోషించాయని, దానిలో 'ఆంధ్రజ్యోతి' పత్రిక నిర్వహించిన పాత్ర అమోఘం అన్నారు. పత్రికలు ప్రజల పక్షాణ నిలబడి వారి గొంతుకగా మారాలన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... వాస్తవాలకు జర్నలిజం నిలువుటద్దంగా నిలుస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

తెలుగు అక్షరం మీద చలం ప్రభావం



చలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు అక్షరం మీద అంచలంచల ప్రభావం వేసినవాడు చలం అని చలం భావన కన్వీనర్ నాళేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో జీవ జలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా.నందిని సిధారెడ్డి, డా.నాళేశ్వరం శంకరం ఎన్. మల్లేశ్వరి, నెల్లుట్ల రమాదేవి హాజరై, చలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ.. చలం రచనలు చేసిన కాలం తరువాత ఎనిమిది దశాబ్దాలు గడిచాక కూడా ఇప్పటికీ చలం రచనల గురించి మాట్లాడుకుంటున్నామంటే ఆ రచనల్లో ఉన్న సార్వకాలీనతను అర్థం చేసుకోవచ్చు అన్నారు. చలం 'ప్రేమలేఖలు' పుస్తకం చదవడం ఒక అద్భుతమైన అనుభవం అని అన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

- అంబర్‌పేటలో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- స్పందించని అధికారులు





ప్రేమ్‌నగర్‌లో ప్రమాదకరంగా తెరచి ఉన్న మ్యాన్‌హోల్స్

అంబర్‌పేట, మే 18 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో మ్యాన్‌హోల్స్ స్థానికులకు ప్రమాదకరంగా మారాయి. డివిజన్‌లోని ప్రేమ్‌నగర్, పటేల్‌నగర్, చెన్నారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్‌కు మూతలు లేకపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళల్లో వాహనదారులు ఎక్కడ మ్యాన్‌హోల్‌లో పడతామోనని భయపడుతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ మరమ్మతులు చేపట్టినా వాటిపై మూతలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాటివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్‌లో సిల్ట్ పేరుకుపోయింది. వర్షా కాలం రానుండడంతో ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు

డివిజన్‌లో మ్యాన్‌హోల్ సమస్యలపై ఎన్నోసార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెబుతున్నప్పటికీ అధికారుల వ్యవహార శైలి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. అధికారులు ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వెంటనే మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేయాలి.

- విజయ్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్, అంబర్‌పేట

పరిష్కరిస్తాం



మ్యాన్‌హోల్స్ సమస్యలు తలెత్తిన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. సమస్యను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించడానికి కృషి చేస్తాం. మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. మూతలు లేని ప్రాంతాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే కొత్తవి ఏర్పాటు చేస్తాం.

- రామకృష్ణ, జీఎం, నారాయణగూడ జలమండలి

పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోపన్యాస సభ నేడు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినయ్‌కుమార్ తదితరులు

రాంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను ఈనెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో సుందరయ్య స్మారకోపన్యాస సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1987లో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రం నుంచి పేదలు, కార్మికులకు విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేసిందన్నారు. 19వ తేదీన సాయంత్రం ఎస్వీకేలో సుందరయ్య స్మారకోపన్యాసం సందర్భంగా నేటి రాజకీయాలు-షహీద్ భగత్‌సింగ్ చరిత్రపై ప్రొఫెసర్ చమన్‌లాల్ ప్రసంగించనన్నారని తెలిపారు. దీనికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, బుచ్చిరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు భూపతి వెంకటేశ్వర్లు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

మావోలతో చర్చలు జరపాలి



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు చిత్రంలో చలపతిరావు, గోవర్ధన్

రాంనగర్; మే 18, (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేసి మావోలతో శాంతి చర్చలను జరపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్ మాట్లాడారు. భారత్, పాక్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో కాల్పుల విరమణకు స్వస్తి పలికి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్‌చేశారు. సాయుధ పోలీసులను క్యాంపుల నుంచి సత్వరమే తరలించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులపై కాల్పుల పేరుతో హత్యలు చేయడం దుర్మార్గమని ఆరోపించారు. కర్రె గుట్ట నుంచి సాయుధ పోలీసులు వెనక్కిరావాలని డిమాండ్ చేశారు. కగార్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 24 వరకు శాంతియుత కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

సీసీకెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు



సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, మే 18 (ఆంధ్రజ్యోతి): బస్తీలలో, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ఎంతో అవశ్యకమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా అసాంఘిక కార్యక్రమాలు, దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీపెద్దలు సత్యం, ఎన్.రమేష్‌గౌడ్, ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో క్లోరిన్ శాతం పరిశీలన



తాగునీటి సరఫరాలో క్లోరిన్ మోతాదును పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

ముషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలీ కాలనీలో జలమండలి అధికారులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి మంచి నీటి సరఫరాలో క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన మంచినీటిని అందించేందుకు పరిశీలిస్తామని జలమండలి డీజీఎం కార్తిక్ రెడ్డి తెలిపారు. కలుషిత నీటి సరఫరాను పూర్తిగా నిర్మూలించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది గోపి, నరేష్, పద్మశాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.అంజనేయులు, సుందర్‌పటాలే పాల్గొన్నారు.

జలమండలి భోలక్‌పూర్ డివిజన్ సెక్షన్ మేనేజర్‌గా శ్రీధర్



ముషీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): జలమండలి భోలక్‌పూర్ డివిజన్ సెక్షన్ మేనేజర్‌గా శ్రీధర్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రసాద్ బాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీధర్ వచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ... భోలక్‌పూర్‌లో కలుషిత నీటి నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు.